క్లుప్తంగా

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కర్లపాలెం: పెదగొల్లపాలెంలో శనివారం పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శుక్రవారం వేద పండితులు శాంతి పూజలు, హోమాలు నిర్వహించారు. ఆగమ బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి బోగేశ్వర శర్మ ఆధ్వర్యంలో గవ్యాంత పూజలు, వాస్తు పూజలు, వాస్తు హోమం, బలిహరణ, గ్రామ ప్రదక్షిణ, క్షీరాధివాసం పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో బూరుగులమ్మ



రేపల్లె రూరల్: పవిత్ర శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని గ్రామ దేవత బూరుగులమ్మ ఆలయంలో ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి వేద మంత్రాల నడుమ పంచామృతాలు, పళ్ల రసాలతో అభిషేక మహోత్సవాలు నిర్వహించారు. గాజుల చీరతో ప్రత్యేక అలంకరణ గావించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, సారెను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, మహిళలకు గాజులు పంపిణీ చేశారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి




రేపల్లె రూరల్: అధిక ధరల నియంత్రణకు సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని 24, 25 వార్డులలో శుక్రవారం సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి మణిలాల్ మాట్లాడుతూ సామాన్య మానవుడు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసే పరిస్థితిలు తీసుకువచ్చే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.కిషోర్, ఆశీర్వాదం, రమేష్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మండల నూతన కమిటీ ఏకగ్రీవం



భట్టిప్రోలు: మండల ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 12 మంది సభ్యులుగా ఉన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్కే మోహుద్దీన్, కె.జగదీష్ ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మనోజ్ కుమార్ వారికి సూచించారు. ఎన్నికైన సభ్యులలో సంజీవ్, కృష్ణ, మనోహర్, అజయ్, శ్రీనివాస్, సత్య, అజయ్, ఈశ్వర్, కార్తీక్, షణ్ముఖ, జితేంద్ర ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు యడ్లపల్లి విద్యార్థులు



యడ్లపల్లి(వేమూరు): గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలోని ఆలపాటి వెంకట రామయ్య జెడ్పీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కుర్రా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 600మీటర్ల పరుగు పందెంలో అండర్-14 విభాగంలో గుమ్మడి దీపిక, బి.మేఘన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. 800మీ.లలో అండర్-16 విభాగంలో వాకా ఉషశ్రీ ద్వితీయ స్థానం, 200 మీటర్లు విభాగంలో డి.ప్రియాంక ద్వితీయ స్థానం సాధించినట్లు వెల్లడించారు. హెచ్‌ఎం, పీఈటీ శరత్ బాబు వారిని అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అమర్తలూరు(వేమూరు): విద్యార్థులందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని హెచ్‌ఎం నిరీక్షణరావు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛ పక్వాడ్ పక్షోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరం మరువని ఆ చిరునవ్వు..!

- పేదల గుండెతడి తాకిన జననేత
- జనం మదిలో నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి పర్యటన
- నేడు దివంగత ముఖ్యమంత్రి వర్ధంతి కార్యక్రమాలు



నగరంలో డ్వాక్రా మహిళలకు రూ.75లక్షల చెక్కును అందిస్తున్న వైఎస్సార్ (ఫైల్‌ఫొటో)

రేపల్లె: తీర ప్రాంత ప్రజల హృదయాల్లో మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి చిరునవ్వులు చిరస్థాయిగా మిగిపోయాయి. ముఖ్యమంత్రిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, 108 అంబులెన్స్, రైతులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీ రుణాలు అందించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి తీరప్రాంత ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూల వర్షంతో స్వాగతం పలికారు. 2009 జనవరి 28న అప్పటి కూచినపూడి, రేపల్లె నియోజకవర్గాల్లో పర్యటించిన సందర్భంగా ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించి తమ ప్రేమను చాటుకున్నారు. ఐదు సంవత్సరాల సంక్షేమ, అభివృద్ధి పాలన అందించిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రసంగిస్తూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఆ మహా నేతకు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తామని ప్రజలు తమ కేరింతలతో మాటిచ్చారు. మహానేత పిలుపు మేరకు 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావును ప్రజలు గెలిపించి, వైఎస్సార్‌కు ఇచ్చిన మాటను తీరప్రాంత ప్రజలు నిలబెట్టుకున్నారు. తొలి నుంచి రేపల్లె నియోజకవర్గంలోని పలువురు నాయకులు వైఎస్సార్‌తో ఆత్మీయ బంధం ఏర్పరుచుకున్నారు. కూచినపూడి నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, రేపల్లెకు చెందిన ప్రస్తుత సత్తెనపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు వైఎస్సార్‌కు అత్యంత సన్నిహితులుగా మారారు. దీంతో ముఖ్యమంత్రిగా వైఎస్సార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మూడుసార్లు నియోజకవర్గంలో పర్యటించి తీరప్రాంతంపై తన కున్న మక్కువను చాటుకున్నారు. నియోజకవర్గంలోని పేరుపెట్టి పిలిచే నాయకులు పదుల సంఖ్యలో ఉన్నారంటే వైఎస్సార్‌కు తీరప్రాంతంతో ఉన్న బంధాన్ని నిరూపిస్తుంది. ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో ఆప్యాయతగా పలకరించే వైఎస్సార్ రచ్చబండ కార్యక్రమానికి వెళుతున్న హెలీకాప్టర్ కనిపించకుండా పోయిందని తెలియటంతో ఒక్కసారిగా తీర ప్రాంతంలోని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఎక్కడ ఉన్నా మహానేత క్షేమంగా ఉండాలంటూ దేవాలయాలు, మసీదులు, చర్చిలలో పూజలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇంతలోనే ప్రమాదానికి గురై వైఎస్సార్ మృతి చెందారన్న వార్త ప్రజలను శోకసంద్రంలో ముంచివేసింది. ఆ మహనీయునికి శనివారం ఘనంగా నివాళులర్పించేందుకు వైఎస్సార్ పార్టీ నాయకులు, ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

రేపల్లె: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు వైఎస్సార్ చిత్రపటానికి, బస్టాండ్ సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు.

కర్లపాలెం: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా కర్లపాలెంలోని వైఎస్సార్ భారీ విగ్రహం వద్ద శనివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమ నిర్వహించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



మహ్మదీయపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు

నగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. చినమట్లపూడి గ్రామ సచివాలయ పరిధిలోని మహ్మదీయపాలెం, పుట్లగుంట, మండేవారిమాలపల్లి, రెడ్లపాలెం, చినమట్లపూడి గ్రామాలలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పంటలకు సాగునీరు అందించాలని, రాత్రిళ్లు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఎంపీ మోపిదేవికి ప్రజలు విన్నవించారు. దీంతో సాగునీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులు ఎంపీ ఆదేశించారు. విద్యుత్ కోతలపై ఆ శాఖ అధికారులను వివరణ కోరారు. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్(ఈఎల్ఆర్) కారణంగా తాత్కాలికంగా విద్యుత్ కోతలు ఉంటాయని అధికారులు ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా కూడా రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఇంటికి రెండు నుంచి మూడు లక్షల రూపాయలను అందించినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. చినమట్లపూడి గ్రామ సచివాలయ పరిధిలోని 700 గడపలకు ఎంపీ మోపిదేవి వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, కరప్రతాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ షేక్ గుల్జార్, ఎంపీటీసీ జరీనా, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరినాథబాబు, ప్రసాదం వాసుదేవ, అబ్దుల్ కరీం, ఆలీబుడ్డా, కరిముల్లా, ఇస్మాయిల్, సుభానీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

కోళ్లపాలెం(భట్టిప్రోలు): ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలను పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకులు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నీలా నాగరాజు శుక్రవారం అందజేశారు.

తెల్లవారక ముందే పింఛన్ల పంపిణీ



యశ్వంత్‌కు పింఛను అందిస్తున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: మండలంలో తెల్లవారక ముందే 12 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొందరు పింఛన్‌దారుల ఇంటి వద్ద లేకపోవడంతో వారు పనులు చేస్తున్న చోటకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,314 పింఛన్లకు గాను సాయంత్రం 5 గంటలకు 69.94 శాతం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

దివ్యాంగ చిన్నారికి అదనపు పింఛను

భట్టిప్రోలు: పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలేనికి చెందిన పాముల యశ్వంత్ దివ్యాంగుల పింఛను రూ. 3వేలు అందుకుంటున్నాడు. తండ్రి లేని ఆ చిన్నారి బాధను గుర్తించిన ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి రూ. 5వేలు పింఛను మంజూరు చేయించారు. శుక్రవారం పింఛన్‌ను యశ్వంత్‌కు అందించారు. అతని తల్లి రాజ్యలక్ష్మికి అంగన్‌వాడీ ఆయా పోస్టును ఇప్పించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబం మంత్రి నాగార్జునకు, ఎంపీపీ లలిత కుమారికి ధన్యవాదాలు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బాపట్లటౌన్:యువతి అదృశ్యమైన ఘటన పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో చోటుచేసుకుంది. చింతా ప్రవళిక శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదని తల్లి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

కేసీ గుప్తాకు ఘన నివాళి

వెల్లటూరు(భట్టిప్రోలు): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కేసీ గుప్తా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వెల్లటూరు క్లబ్‌కు కేసీజీఎఫ్ స్పాన్సర్ చేసిన నంబూరు తేజను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అధిక ధరలపై అధికారులకు వినతి

భట్టిప్రోలు: నిత్యావసర ధరలను తగ్గించి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కమిటీ నాయకులు ఎం. సత్యన్నారాయణ, పప్పుల అహరోను, జి.నాగరాజు, ఎ. శ్రీనివాసరావు, జీవీ బసవకోట్లు, బి. నాగమల్లేశ్వరరావు, కె. పార్థసారధి పాల్గొన్నారు.

అమృతలూరులో..

అధిక ధరలకు నిరసనగా నిర్వహిస్తున్న సీపీఎం సమరభేరిని జయప్రదం చేయాలని ఆ పార్టీ వేమూరు మండల కార్యదర్శి బొనిగల అగస్టీన్ ప్రభుత్వాలను కోరారు. ఈ సందర్భంగా అమృతలూరు మండలం కూచిపూడి సచివాలయ కార్యదర్శి ఎం. సత్యన్నారాయణకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు. పి. రాజు, చావలి రమేష్, కె. శ్యామ్‌సన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌కు ఘన నివాళులు..

వేమూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ప్రతి గ్రామంలో నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. వేమూరు బస్టాండ్ సెంటరులో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తెనాలిఅర్బన్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. డిపో పరిధిలోని సమస్యలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని చెప్పారు. సెల్‌నెంబర్ : 9959225422లో సంప్రదించాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి బుధవారం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 31 నాటికి 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయని వివరించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడు, ఎనిమిది తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 12,13 తేదీల్లో ఇంటర్వ్యూలు, 15న ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటన చేస్తామన్నారు.

స్టేడియం పరిశీలన

తెనాలిరూరల్: స్థానిక అమరావతి కాలనీలోని ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియాన్ని పలు విభాగాల అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. స్టేడియంలో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు అక్కడ వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా పరిశీలన చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాలతో సాయంత్రం స్టేడియానికి వచ్చిన మున్సిపల్ ఇంజినీర్ కె నాగమల్లేశ్వరరావు సహా హౌసింగ్, ఎలక్ట్రికల్ విభాగ అధికారులు సమస్యలు పరిశీలించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోచ్ కె నాగరాజు, సునీల్ పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించిన అధికారులు సీజ్ చేశారు. తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డులో ఇసుక ట్రాక్టర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, ఆయన సిబ్బంది శుక్రవారం గుర్తించారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో వాహన యజమానిపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం నుంచి ఇసుక తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

సోషల్‌మీడియా పోస్టులపై ఫిర్యాదు

తెనాలిరూరల్: తెనాలి వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు శుక్రవారం సాయంత్రం త్రీ టౌన్ పోలీసులను కలిశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు కొంత కాలంగా ఫేస్‌బుక్‌లో మైనార్టీలను కించ పరుస్తూ, దూషిస్తూ అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతున్నారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో ఇబ్బడిముబ్బడిగా ఫేక్ అకౌంట్లను రూపొందించి మైనార్టీలను అసభ్య పదజాలంతో దూషించడమే పనిగా పెట్టుకున్నారని రాత పూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరికి కొందరు నాయకులు కూడా సహకారం అందిస్తున్నారని, ఫేక్ అకౌంట్ల ద్వారా పోస్టులు పెడుతూ మైనార్టీలను కించపరుస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో గుండిపార్వతీ అమ్మవారు



పెదపులివర్రులో బాలాత్రిపుర సుందరి

భట్టిప్రోలు: శ్రావణమాసం పురస్కరించుకుని మూడవ శుక్రవారం అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక విఠలేశ్వర నగర్‌లోని సీతారామ మందిరంలో అమ్మవారిని పుష్పాలతో అందంగా అలంకరించారు. భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామ దేవతలు దండిపార్వతీ, అడెమ్మ తల్లి, భట్టిప్రోలు శ్మశానవాటికలో కొలువైన గుండి పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మ, భూనీలా సమేత వరదరాజస్వామి దేవాలయంలో పేరిందేవి, రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వెల్లటూరు గ్రామదేవత కట్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపడతాం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



ఎంపీ మోపిదేవికి వినతిపత్రం అందజేస్తున్న బాధిత మహిళలు

రేపల్లె: పొందని రుణాలు చెల్లించాలని మహిళలకు బ్యాంకుల నుంచి వస్తున్న నోటీసులపై, ఇందుకు కారణమైన ఆర్పీలు, సిబ్బందిపై విచారణ చేపట్టాలని మెప్మా పీడీ, మున్సిపల్ కమిషనర్‌కు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఆదేశాలు జారీ చేశారు. బాధిత డ్వాక్రా మహిళలు ఐద్వా, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీ మోపిదేవిని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో కలిసి సమస్యను విన్నవించారు. బాధిత మహిళల పేరుతో అక్రమ రుణాలు పొందిన అంశంపై క్షేత్రస్థాయిలో అధికారులతో విచారణ చేపట్టి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ మోపిదేవి వారికి భరోసా ఇచ్చారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్, ఐద్వా రేపల్లె పట్టణ కమిటీ అధ్యక్షురాలు షేక్.జహీద్, కార్యదర్శి షేక్.ఆశ, గౌరవాధ్యక్షురాలు ఆర్.నాగమణి, ఇతర డ్వాక్రా మహిళలు గౌసే, భూలక్ష్మి, షబానా సుల్తానా, సీపీఎం నాయకులు కె.ఆశీర్వాధం తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటు తెరవకుంటే ఆందోళన

అఖిలపక్ష రైతు సదస్సులో సాధన కమిటీ ఎన్నిక



అఖిలపక్ష రైతు సదస్సులో మాట్లాడుతున్న జొన్నా శివ శంకరరావు

తెనాలి: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని రైల్వేశాఖ పొదుపు చర్యల పేరుతో రైల్వే గేట్లను మూసివేస్తూ రైతులు, ప్రజలను ఇక్కట్లపాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజలను చైతన్యవంతులను చేసి ఆందోళన చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకరరావు హెచ్చరించారు. చినరావూరు-జంపని మధ్య మూసివేసిన రైల్వేగేటును తెరిపించాలని కోరుతూ రూరల్ మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలోని పాతపంచాయతీ కార్యాలయంలో అఖిలపక్ష రైతు సదస్సు నిర్వహించారు. ముద్దన సాంబశివరావు అధ్యక్షత వహించారు. జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు యావత్తూ మూసివేసిన గేటును తెరవాలని రైల్వే అధికారులకు నివేదించినా, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ రైతుల ఉద్యమస్ఫూర్తితో గేటు తెరిపించేవరకు దశలవారీ ఆందోళన చేపట్టాలనీ, రైతుసంఘం అండగా ఉంటుందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రూ.4 కోట్ల నబార్డు నిధులతో రోడ్డు వేసినా రైలు గేటు తెరవకపోవటం దుర్మార్గమన్నారు. గేటు మూసివేసిన కారణంగా చేలల్లో పండిన పంటను ఇంటికి చేర్చాలంటే 7-8 కిలోమీటర్ల అదనంగా చుట్టు తిరిగి రావాల్సి వస్తోందని, ఇందుకు అదనంగా ఖర్చవుతోందని బొంతా ఆంజనేయులు, తాటి భూలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తాటి వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా, కుర్రా వెంకటరమణ, కేవీ సత్యనారాయణ, తాటి కృష్ణ తదితరులు 13 మందితో రైల్వే గేటు సాధన కమిటీని ఎన్నుకున్నారు.